సాక్షి ఖమ్మం

ఆదివారం। 12। జనవరి। 2025



కలలు.. కనుమరుగు

యువతను ప్రోత్సహించేలా పథకాల అమలు సక్రమంగా జరగక వారి ఆశలు నిర్వీర్యం అవుతున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. 10లో



అర్హులందరికీ పథకాలు

ప్రభుత్వం అమలుచేయనున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 17°

వాతావరణం

జిల్లాలో ఆదివారం చలిగాలుల తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ఈ ప్రభావం సాయంత్రం తర్వాత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం తన స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం నుంచి 10–30 గంటలకు ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లోని నివాసానికి చేరుకుంటారు. అక్కడ మున్నేరుపై రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో జరగనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో పాల్గొనేందుకు బయలుదేరతారు.

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునే స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించగా రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



బౌద్ధక్షేత్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోకెల్లా పెద్దదైన నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె క్షేత్రం చరిత్రను తెలుసుకుని క్షేత్రం చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న విశ్రాంతి భవనాన్ని పరిశీలించడంతో పాటు రూ.2.50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్‌చక్రవర్తి, ఎంపీఓ సీ.హెచ్.శివ తదితరులు పాల్గొన్నారు.

18న నవోదయ ప్రవేశ పరీక్ష

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2025–26 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 18న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. నవోదయలో 80 సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరించగా ములుగు జిల్లాలోని వెంకటాపురం సహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,213మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉదయం 11–30 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు విద్యార్థులు 10–30 గంటల్లోపు చేరుకోవాలని, ఆధార్‌కార్డు లేదా నివాస ధ్రువీకరణపత్రంతో పాటు ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్నుతో రావాలని సూచించారు. కాగా, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నవోదయ వైబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులు(హాల్‌టికెట్) డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

మధ్యవర్తిత్వ పరిష్కార కేంద్రానికి ఎంపిక



సర్టిఫికెట్ అందుకుంటున్న యుగంధర్

ఖమ్మంలీగల్: న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వ పరిష్కార కేంద్రానికి ఖమ్మంకు చెందిన ముగ్గురు న్యాయవాదులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అలవాల యుగంధర్, ఎస్.శ్రీనాథ్, బి.పద్మప్రసూన ఎంపిక కాగా వీరికి సికింద్రాబాద్‌లోని జ్యుడీషియల్ అకాడమీలో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ శ్యాంకోషి, జస్టిస్ జె.శ్రీనివాస్ శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేయగా వీరిని పలువురు అభినందించారు.

ఆశలు ఫలించే వేళాయె...



రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మరో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుడుతోంది. కొన్నాళ్లుగా అన్నదాతలు ఎదురుచూస్తున్న రైతుభరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, కూలీలకు ఆత్మీయ భరోసా, తెల్లరేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఈనెల 16నుంచి తుది కసరత్తు చేపట్టనున్నారు. మరోపక్క ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ పథకాల అమలు, విధివిధానాలపై చర్చించేందుకు సోమవారం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఖమ్మంలో భేటీ కానున్నారు. ఇదంతా పూర్తయ్యాక ఈనెల 26న లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేసి పథకాలను దరి చేరుస్తారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

నాలుగు సంక్షేమ పథకాలకు 26న ముహూర్తం

- ఈనెల 16 నుంచి తుదిదశ కసరత్తు..
- జాబితాలో రైతుభరోసా, ఇళ్లు, ఆత్మీయ భరోసాతో పాటు రేషన్‌కార్డులు
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో రేపు మంత్రి కోమటిరెడ్డి సమావేశం

రైతులకు 'భరోసా'..

జిల్లా రైతులు రైతుభరోసాపై ఆశలు పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఈనెల 26 నుంచి అర్హులైన రైతులకు ఏటా ఎకరాకు రూ.12వేల చొప్పున నగదు జమ చేసే ప్రక్రియ మొదలుకానుంది. వానాకాలం, యాసంగి సీజన్లలో రూ.6వేల చొప్పున ఈ నగదు అందుతుంది. జిల్లాలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 3,29,982 మంది రైతులకు రూ.362.94 కోట్ల మేర రైతుబంధు కింద చెల్లించేవారు. ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిన విధివిధానాల మేరకు ఎందరికి భరోసా దక్కుతుందో ఈనెల 26న తేలనుంది. ఆ రోజున గ్రామసభల ద్వారా అర్హులను ప్రకటించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో కొండలు, గుట్టలు, వాగులు, చెరువులతోపాటు ఇళ్ల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటుకు బదిలీ చేసిన భూములకు సైతం రైతుబంధు అందేది. అయితే, ఇప్పుడు మాత్రం సాగుకు యోగ్యమైన భూములకే రైతుభరోసా ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.

ఇళ్లలో పేదలకు ప్రాధాన్యత..

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ఈ పథకం కూడా ఈనెల 26నుంచి అమలు కానుంది. ప్రజాపాలన సభల్లో జిల్లాలో 3,57,869 దరఖాస్తులు అందాయి. వీటి ఆధారంగా అధికారులు చేపట్టిన క్షేత్రస్థాయి సర్వే చివరి దశకు చేరింది. ఆపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మరోమారు తనిఖీ చేస్తున్నారు. యాప్‌లో నమోదైన వివరాల ఆధారంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల్లో చేపడతారు. తొలిదశలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాల్లో అదనంగా ఇళ్లు కేటాయించాలని నిర్ణయించింది. ప్రతీ ఇంటికి రూ.5లక్షల చొప్పున నాలుగు విడతల్లో నగదు అందజేస్తారు. మరోపక్క మండల కేంద్రాల్లో మోడల్‌హౌస్‌ల నిర్మాణం కూడా జరుగుతోంది. తద్వారా రూ.5లక్షల నగదుతోనే ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తారు.

భూమి లేని పేదలకు..

భూమి లేని నిరుపేదలకు ఏటా రూ.12వేల చొప్పున రెండు విడతలుగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో అమలయ్యే ఈ పథకానికి కూడాఈనెల 26నే ముహూర్తంగా నిర్ణయించారు. ఈ పథకంలో భూమి లేని నిరుపేద కుటుంబాన్ని యూనిట్‌గా ఎంపిక చేస్తారు. అయితే, ఈ కుటుంబంలో ఎవరైనా ఒకరు కనీసం 20 రోజులపాటు ఉపాధి హామీ పథకం కింద పని చేసి ఉండాలి. కాగా, ఇక జిల్లాలో 2.23 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. 3.08 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఇందులో ఎందరు అర్హత సాధిస్తారో త్వరలోనే వెల్లడి కానుంది. అలాగే, తెల్లరేషన్‌కార్డుల కోసం గతంలో 48,113 మంది దరఖాస్తులు అందాయి. వీరిలో నుంచి అర్హులను గుర్తింపునకు ఈనెల 26న గ్రామసభలు నిర్వహించి జాబితాలు ప్రకటిస్తారు.

లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తెల్లరేషన్‌కార్డులకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు తుది దశకు చేరింది. ఈ పథకాల అమలుపై సమీక్షించేందుకు సోమవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ఆయన పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై సూచనలు చేస్తారు. ఆపై 16వ తేదీ నుంచి అధికారులు లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు ప్రారంభించి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాబితాలు వెల్లడించే అవకాశముంది.

సంక్రాంతి కానుకగా 'డబుల్' ఇళ్లు



డబుల్ ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ తదితరులు

- త్వరలోనే మిగతా హామీల అమలు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను సంక్రాంతి కానుకగా అందజేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండలంలోని రామన్నపేటలో నిర్మించిన 80 డబుల్ ఇళ్ల గృహ సముదాయాన్ని మంత్రి శనివారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేసిన ఆయన పలువురి ఇళ్లలో గృహప్రవేశాలకు హాజరయ్యారు. ఆతర్వాత ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రజల ఆశీర్వాదంతో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడగా, గత పదేళ్లలో జరిగిన అవకతవకలను సరిచేసేందుకు ఇంతకాలం పట్టిందని తెలిపారు. ఈనేపథ్యాన ఇప్పటికే పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల నెరవేర్చడంపై గత పాలకుల నిర్లక్ష్యం వహిస్తే తాము మాత్రం నిర్మాణం పూర్తయిన ఇళ్లను పంపిణీ చేస్తూనే మిగతా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంపై దృష్టి సారించామని తెలిపారు. ఇటీవల సీఎం అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సమావేశంలో రైతుభరోసా, నూతన రే షన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు కూలీలకు ఆర్థిక సాయం చర్చించి ఈనెల 26నుంచి త్వరలో అమలుకు నిర్ణయించామని వెల్లడించారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు కేటాయించి గ్రామసభల ద్వారా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. అలాగే, త్వరలోనే రహదారులు, డ్రెయినేజీలు, పార్కుల నిర్మాణ పనుల మొదలవుతాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇళ్ల కోసం చాలారోజుల నుంచి ఎదురుచూస్తున్న వారి కల నెరవేరిందని చెప్పారు. ఈ సముదాయంలో రహదారి నిర్మాణానికి రూ.2కోట్లను మంత్రి మంజూరు చేయగా, ప్రజల వినతితో అంగన్‌వాడీ కేంద్రం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఎకరం స్థలంలో రూ.50లక్షలతో పిల్లల కోసం ప్రత్యేక పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, హౌజింగ్ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ రవికుమార్‌తో పాటు పలువరు నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ పరేడ్‌కు ఆహ్వానం

ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురికి అవకాశం



ఎం.మేఘన



అజ్మీరా రాందాస్‌నాయక్

నేలకొండపల్లి/కామేపల్లి: ఢిల్లీలో ఈనెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి పలువురికి ఆహ్వానం అందింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురికి ఎంపిక చేయగా జాబితాలో ఉమ్మడి ఖమ్మం వాసులు ఐదుగురికి స్థానం దక్కింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని బీసీ వసతిగృహంలో చదువుతున్న ఎం.మేఘనను చదువు, క్రీడల్లో ప్రతిభ కనబర్చినందుకు ఎంపిక చేసినట్లు తెలిసింది. ఆమెతో పాటు ఖమ్మం దోరెపల్లి సీతారామయ్యనగర్‌కు చెందిన ఇస్లావత్ మేఘనను పీఎం యశస్వి పథకం కింద ఎంపిక చేశారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాచనపల్లి పరిధి జగ్గుతండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ జర్పుల నీలిమ కూడా పరేడ్‌కు హాజరుకానున్నారు. ఇక పీఎం మత్స్య సంపద పథకం లబ్ధిదారుడైన కామేపల్లికి చెందిన అజ్మీరా రాందాస్‌నాయక్ సైతం పరేడ్‌కు ఎంపికయ్యారు. ఆయన కామేపల్లి పెద్ద చెరువు మత్స్యశాఖ సొసైటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అంతేకాక మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ప్రస్తావించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరానికి చెందిన కూతురు సర్వి రాజశేఖర్, ఆయన కుమార్తె గాయత్రి సైతం పరేడ్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం



కూడారై వేడుకను నిర్వహిస్తున్న వేద పండితులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో శనివారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. ధనుర్మాసోత్సవాల్లో 27వ రోజు ఈ వేడుకను నిర్వహిస్తారు. గోదాదేవి అమ్మవారికి శ్రీరంగనాథునితో వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసం నివేదన చేస్తానని మొక్కును తీర్చారని ప్రతీతి. స్వామివారితోపాటు గోదాదేవి అమ్మవారిని బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ద్రవిడ ప్రబంధాలతోపాటు పాయసాన్ని సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

సత్తుపల్లికి మచ్చ తీసుకురావొద్దు

- వివేకానందుడి బోధనలు స్ఫూర్తి దాయకం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



వివేకానంద ఎక్స్‌లెన్స్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: ముఖ్యమంత్రి, మంత్రులను అందించిన సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు ఉన్నందున కోడి పందేలు, పేకాట, మట్కాతో మచ్చ తీసుకురావొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఇలాంటివి వెలుగుచూస్తే నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ఎమ్మెల్యే రాగమయి, అధికారులకు సూచించారు. సత్తుపల్లిలో వివేకానంద ఎక్స్‌లెన్స్ భవనం, రామగోవిందాపురం పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలగం వెంగళరావు జిల్లా పరిషత్ చైర్మన్ నుంచి సీఎం, కేంద్ర మంత్రి వరకు ఎదిగారని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన తాను వెంగళరావు అభిమానిగా ఆయన చేయలేని పనులను కూడా చేశానని చెప్పారు. కాగా, వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.

పండుగకల్లా తాగునీరు ఇవ్వండి

రామగోవిందాపురానికి తాగునీరు అందడం లేదని స్థానిక మహిళలు మంత్రి తుమ్మల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన సంక్రాంతి పండుగకల్లా నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సొసైటీ భూములను రైతులు కమిటీగా ఏర్పడి సాగులోకి తెచ్చుకోవాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, డీసీఓ గంగాధర్, డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు, డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, ఆర్డీఓ రాజేంద్రగౌడ్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావు, శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరరావు, ఉడతనేని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం కాలేజీ భవన నిర్మాణానికి రూ.5కోట్లు

మధిర: మధిర మండలం సిరిపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మహర్దశ పడుతోంది. ఈ కాలేజీ భవన నిర్మాణాలకు తాజాగా రూ.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇటీవల కళాశాల సమస్యలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన నిధులు కేటాయించారు. ఈమేరకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎంకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, భవనం నిర్మాణం పూర్తయితే విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి.

గంగిరెద్దుల విన్యాసాలేవి..?

సంక్రాంతి వచ్చినా సందడి చేయని బసవన్నలు

- పల్లెల్లోనూ క్రమంగా తగ్గిపోతున్న ఆదరణ
- పోషణభారంతో పెంపకం చేపట్టలేకపోతున్న నిర్వాహకులు



గ్రామంలో తిరుగుతున్న బసవన్న (ఇన్‌సెట్) గంగిరెద్దు లేకుండా ఇంటింటికి తిరుగుతున్న వ్యక్తి

పాల్వంచరూరల్: ఆధునిక కాలంలో క్రమంగా ఆచార సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. గతంలో సంక్రాంతి వస్తుందంటే ఊరూరా దూదూ బసవన్నలు సందడి చేసేవి. కానీ ప్రస్తుతం పండుగ సమీపించినా ఉన్నా గంగిరెద్దులు అంతగా కన్పించడం లేదు. ఆదరణ లేక పోషణభారం కావడంతో నిర్వాహకులు గంగిరెద్దుల పెంపకం చేపట్టడంలేదు. బసవన్నలు లేకుండానే ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేస్తున్నారు.

బసవన్నకు గ్రాసం కొరత

ఒకప్పుడు సంక్రాంతికి ముందు వేకువజామున చలిలో గంగిరెద్దులు ఇంటింటా తిరిగేవి. నిర్వాహకులు పల్లె పల్లె తిరుగుతూ ప్రదర్శనలు ఇస్తుండేవారు. ప్రజలు ఇచ్చే కానుకలతో వారి కుటుంబాలు ఆరునెలలపాటు సంతోషంగా గడిపేవి. ఆ తర్వాత కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. క్రమంగా గంగిరెద్దులు కనుమరుగవుతున్నాయి. ఈ సంవత్సరం గంగిరెద్దుల సందడే కన్పించడం లేదు. బసవన్నలతో ఊరూరా తిరిగినా ఆదరణలేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. తమతోపాటు ఎద్దులకు కడుపు నిండటంలేదని, గ్రాసం కూడా సక్రమంగా లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరి సాగు చేసిన రైతులు వ్యవసాయ కూలీలతో పంటను కోయిస్తే ఎండుగడ్డి రైతుల వద్ద అందుబాటులో ఉండేది. ఇప్పుడు యంత్రాల ద్వారా వరికోతలు కోస్తుండటంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో గంగిరెద్దులకు వరిగడ్డి దొరకడం కష్టంగా మారిందని చెప్పవచ్చు.

ఇళ్లు, రేషన్ కార్డులూ లేవు

గంగిరెద్దులను నమ్ముకుని 50కి పైగా కుటుంబాలు అనేక సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ తదితరమండలాల్లో జీవనం సాగిస్తున్నాయి. తరతరాలుగా గంగిరెద్దులను ఆడించుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. ఇప్పటికీ వ్యవసాయ భూములు, ఇళ్లు లేవు. సంక్రాంతి పండుగతోపాటు ఎవరైనా పెద్దవాళ్లు కాలం చేస్తే కర్మల రోజున గంగిరెద్దులతో నిర్వాహకులు విన్యాసాలు చేయిస్తున్నారు. దాతలు ఇచ్చే డబ్బులతో బతుకు వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఆడిస్తేనే పూటగడుస్తుంది



తాత ముత్తాతల నుంచి ఆచారంగా గంగిరెద్దులను ఆడించుంకుంటూ జీవనం సాగిస్తున్నాం. సంక్రాంతి సందర్భంగా ఊరూరా తిరిగితే అంతో ఇంతో ఆదాయం వస్తుంది. మిగిలిన రోజుల్లో సాయం చేసేవారు ఉండరు. దీంతో పూట గడవడమే కష్టంగా మారింది.

– ఎర్ర వెంకన్న, సాటివారిగూడెం

ఫోన్ పే అంటున్నారు



గతంలో గంగిరెద్దులతో ఏ ఇంటికి వెళ్లినా అంతో ఇంతో నగదు ఇచ్చేవారు. ఇప్పుడు అందరూ నగదు లేదని, ఫోన్ పే చేస్తామంటున్నారు. కానీ మాకు అసలు ఫోన్లే లేవు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– వీరన్న, రాజాపురం

పశుగ్రాసం కరువు



సంక్రాంతి పండుగకు గంగిరెద్దులను తీసుకుని గ్రామీణ ప్రాంతాలకు వెళ్తే ఆరునెలలకు సరిపడా గ్రాసం దొరికేది. ఇప్పుడు ఆదరణ కరువైంది. ఎన్ని గ్రామాలు తిరిగినా ఎండుగడ్డి లభించడంలేదు. బసవన్నల పొట్ట నింపలేకపోతున్నాం.

– ఏ.వెంకన్న, ఎర్రగుంట

క్లుప్తంగా

మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలంలోని కొల్లాపురంలో గత 47ఏళ్లగా నిర్వహిస్తున్నట్లుగానే ఈసారి సైతం సంక్రాంతి పండుగకు మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి పోటీల్లో విజేతలకు రూ.20వేలు, రూ.16వేలు, రూ.12వేలు, రూ.8 వేల నగదు బహుమతితో పాటు జ్ఞాపిక అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ జట్ల వివరాలను ఈనెల 13వ తేదీలోగా 77023 47573, 77028 89013, 97016 36752 నంబర్లలో నమోదు చేసుకోవాలని నిర్వాహకులు ఆదినారాయణ, బుగ్గ వెంకటేశ్వర్లు, ఎర్రిపోతుల మల్లేష్, చీమల అభిషేక్, జార్జి, శశి, వినోద్, విఘ్నేష్, రఘు, దిలీప్ కోరారు.

వైరాలో పాటల పోటీలు..

వైరా: సంక్రాంతి సందర్భంగా రవళి కళా నిలయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన వైరాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు గద్వాల రమేష్ తెలిపారు. ఈనెల 13న సాయంత్రం 3నుంచి రాత్రి 10 గంటల వరకు కొత్త బస్టాండ్ సమీపంలోని ఇండోర్ స్టేడియంలో దేశభక్తి, అభ్యుదయ గీతాలు పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఎంట్రీ ఫీజు రూ.200 కాగా, మొదటి నాలుగు స్థానాల్లో నిలిచే వారికి వరుసగా రూ.10,,116, రూ.5,116, రూ. 3,116, రూ.2,116 నగదు బహుమతులు ఇస్తామని తెలిపారు. వివరాలకు 99486 43074 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలకు...



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్‌పర్సన్ నిశితశర్మ, పక్కన డీఈఓ శర్మ తదితరులు

ఖమ్మంక్రైం: ప్రతీ విద్యార్థి శ్రద్ధగా చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరడం సులభమవుతుందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మంలోని శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాల 30వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ చైర్‌పర్సన్ నిశితశర్మ ప్రారంభించగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు సీపీ సునీల్‌దత్, చైర్‌పర్సన్ నిశితశర్మతో పాటు కలిసి డీఈఓ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తమ విద్యే భవిష్యత్‌కు బాటలు వేస్తుందని, ఇందుకోసం ఏకాగ్రత, పట్టుదలతో చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, సుశీల్ సింగ్, ఆర్‌ఐ కామరాజు, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ లక్ష్యాలు చేరుకోవాలి

మధిర: గర్భిణులు, చిన్నారులకు సమయం ప్రకారం వ్యాక్సిన్లు వేస్తూ వంద శాతం లక్ష్యాలను సాధించాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ చింతల వెంకటరమణ సూచించారు. మధిర ఎస్సీ కాలనీ, రాయపట్నం ఎస్సీ కాలనీలో వ్యాక్సినేషన్ శిబిరాలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యాక్సిన్ల నిల్వలపై జాగ్రత్తలు వహించాలని సిబ్బందికి సూచించారు. ఆతర్వాత పలువురి ఇళ్లకు వెళ్లి టీకాల కార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ గోవింద్, ఉద్యోగులు సుబ్బలక్ష్మి, సరోజిని, లంకా కొండయ్య, విజయకుమారి, విజయలక్ష్మి, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఖమ్మంఅర్బన్ : నగరంలోని మమతా రోడ్డు జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్‌ను శనివారం ఖమ్మం అర్బన్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ భానుప్రకాష్ కథనం ప్రకారం.. వాహనాలు తనిఖీల్లో భాగంగా శ్రీశ్రీ సర్కిల్ వైపు నుంచి ఖమ్మంలోకి వస్తున్న ఓ ఇసుక టిప్పర్‌ను ఆపి ఆరా తీశారు. దీంతో లారీ డ్రైవర్ గొల్లపల్లి అనిల్ తాము గోదావరి నది నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఖమ్మంకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నామని నేరం ఒప్పుకున్నాడు. ఈమేరకు డ్రైవర్, టిప్పర్ ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం?

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్ వద్ద ఖమ్మం సూర్యాపేట ప్రధాన రోడ్‌పై ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. ఖమ్మంకు చెందిన ఇద్దరు యువకులు శనివారం కిట్స్ కళాశాల వైపు నుంచి ఖమ్మం వస్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో వారిరువురికి తీవ్రగాయాలు కాగా.. స్థానికులు ఖమ్మంకు తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అశోక్ లేలాండ్ బోల్తా..

చింతకాని: మండల పరిధిలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో అశోక్ లేలాండ్ వాహనం శనివారం రాత్రి అదుపుతప్పి బోల్తా పడింది. చింతకాని నుంచి ఖమ్మం వైపు తౌడు లోడుతో వెళ్తున్న అశోక్ లేలాండ్ టైరు ఒక్కసారిగా పంక్చర్ కావడంతో అదుపు తప్పి రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.



కలలు.. కనుమరుగు!

యువజనులకు ప్రోత్సాహం

- సామాజిక కార్యక్రమాలపై ప్రభుత్వం శీతకన్ను
- ఆందోళనలో యువ కళాకారులు
- ప్రోత్సాహకాలు మరిచిన పాలకులు
- నేడు స్వామి వివేకానంద జయంతి

ఖమ్మం రాపర్తినగర్: యువత చెడు మార్గాల్లో నడవకుండా ఉండేందుకు జాతీయస్థాయిలో అరైన తీరు అనుసరించడం లేదని, దీంతో యువజనులు అధిక శాతం చెడుమార్గాల వైపు పయనిస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. యువతను అన్ని రంగాల్లో రాణించేలా వెన్నుతట్టి ప్రోత్సహించాలి కాని ప్రస్తుతం కాలంలో దీనికి భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించడంతో యువతలోని ప్రతిభ నిర్వీర్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యువతను క్రీడలు, కళల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన యువకుల్లోని కళలను వెలికి తీసేందుకు ప్రభుత్వాలు గత 22 ఏళ్లుగా నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో యువజనోత్సవాలు కంటితుడుపుగా నిర్వహిస్తున్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గతంలో ప్రభుత్వాలు ప్రత్యేక పథకాల ద్వారా రుణాలు ఇచ్చేవి. కాని ఆ పథకాలన్నీ నిర్వీర్యమయ్యాయి. జిల్లా యువజన సంఘం, నెహ్రూ యువక కేంద్ర ఆధ్వర్యాన జిల్లాలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారని, కానీ ప్రభుత్వాలు యువతకు నిధులు కేటాయించక, సామాజిక బాధ్యతల పట్ల అవగాహన కల్పించకపోవడంతో చెడు మార్గాల వైపు పయనిస్తున్నారని నిపుణులు అంటున్నారు. స్వామి వివేకానందుడి స్ఫూర్తితో ఆయన జయంతి వేడుకల సందర్భంగా మాత్రమే యువజన సంఘాలను గుర్తు చేసుకునేందుకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారే ఆరోపణలున్నాయి.

వివేకానందుడి స్ఫూర్తితో..

వివేకానంద జయంతిని పురస్కరించుకుని జనవరిలో కేంద్ర ప్రభుత్వం జాతీయ యువజనోత్సవాలను నిర్వహిస్తోంది. ఈక్రమంలో యువతను కళారంగంలో ప్రోత్సహించేందుకు గత 25 ఏళ్లుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో కళాకారులు ప్రదర్శించిన కళలను గుర్తించి జాతీయస్థాయికి ఎంపిక చేస్తున్నారు. ఈనేపథ్యాన ఈనెలలో జిల్లాస్థాయి ఉత్సవాలను నిర్వహించి ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన కళాకారులను రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

యువజనోత్సవాలు నిర్వహిస్తున్నాం



ప్రతి ఏటా జిల్లాలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నాం. నెహ్రూ యువక కేంద్రంతో సంయుక్తంగా జరుపుతున్నాం. జిల్లాలో ఎంపిక చేసిన వారిని జాతీయస్థాయి పోటీలకు పంపుతున్నాం. యువతను అన్ని విధాల ప్రోత్సాహించేలా చర్యలు తీసుకుంటున్నాం. – టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్ఓ

యువజన సంఘాలు నిర్వీర్యం



జిల్లాలోని యువజన సంఘాలు నిర్వీర్యమవుతున్నాయి. గతంలో నిధులు బాగానే ఇచ్చేవారు కాని ఇప్పుడు కనీసం చేసిన కార్యక్రమాలకే ఇవ్వడం లేదు. సామాజిక, ప్రోత్సాహక చర్యల్లోనూ తమను భాగస్వాములు చేయడం లేదు. దీంతో యువతను సక్రమమార్గంలో నడిపించలేకపోతున్నాం – జక్కుల వెంకటరమణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి

మత్తుకు బానిస అవుతున్నారు



ప్రస్తుతం సమాజంలో యువత మత్తు పదార్థాలు, సామాజిక మాధ్యమాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు పాలకులు రుణాలు ఇచ్చేలా చూడాలి. అప్పుడే స్వామి వివేకానందకు ఘన నివాళి అర్పించినవారవుతాం. – కె.ఉమాశంకర్, జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షుడు

గతంలో అనేక కార్యక్రమాలు



పదేళ్ల క్రితం యువజన సంఘాల ఆధ్వార్యాన కార్యక్రమాలు బాగా జరిగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనబడడం లేదు. కనీసం చేసిన ప్రోగ్రాంలకే బిల్లులు రావడం లేదు. ఇప్పటికైనా యువజన సంఘాలు, యువత కార్యక్రమాలను విరివిగా చేస్తేనే యువత బాగుపడుతుంది. లేదంటే యువతను కాపాడుకోలేం. – తాటికొండ భాగ్య, జిల్లా యువజన సంఘాల నాయకురాలు

సంక్రాంతి సందడి!





అన్నిచోట్ల సంక్రాంతి సందడి మొదలైంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలోవిద్యార్థులకు పండుగ ప్రాముఖ్యతను వివరించేలా శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు, పూలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అంతేకాక పిండివంటలు చేయిస్తున్నట్లు, గడ్డిమోపులు తీసుకెళ్తున్నట్లుగా వారితో ప్రదర్శనలు ఇప్పించారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

13న 'మంచుకొండ' ఎత్తిపోతలకు శంకుస్థాపన

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలానికి సాగునీటి సదుపాయం కల్పించేందుకు సాగర్ ప్రధాన కాల్వపై మంచుకొండ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ నిర్మాణానికి రూ.66 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించగా, లిఫ్ట్ ద్వారా మండలంలోని సుమారు 30పైగా చెరువులకు పైపులైన్ ద్వారా సాగర్ జలాలను తరలించనున్నారు. వచ్చే వ్యవసాయ సీజన్ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యాన పథకానికి సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మంవన్‌టౌన్: రఘునాథపాలెం మండలం ముంచుకొండలో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఎత్తిపోతల పథకం శంకుస్థాపన సందర్భంగా నిర్వహిస్తున్న సభను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం శంకుస్థాపనకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మేయర్ పి.నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారాతో పాటుబాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, యర్రం బాలగంగాధర తిలక్, కమర్తపు మురళి, మిక్కిలినేని నరేందర్, నాగండ్ల దీపక్ చౌదరి, లకావత్ సైదులు, వెంకటరమణ, రాపర్తి శరత్ తదితరులు పాల్గొన్నారు.

'జగ్జిత్‌సింగ్‌కు ఏం జరిగినా కేంద్రానిదే బాధ్యత'



ధర్నాలో పాల్గొన్న వెంకటేశ్వరరావు, రాంబాబు తదితరులు

ఖమ్మం వ్యవసాయం/ఖమ్మం మామిళ్లగూడెం: రైతుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో దీక్ష చేస్తున్న జగ్జిత్ సింగ్ దల్లెవాల్‌కు ఏదైనా జరిగితే కేంద్రప్రభుత్వమే బాధ్యత వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు హెచ్చరించారు. పంజాబ్ సరిహద్దు ఖనేరీలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జగ్జిత్‌సింగ్‌కు మద్దతుగా ఖమ్మం పాత బస్టాండ్ వద్ద శనివారం దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లచట్టాల రద్దు, పంటలకు గిట్టుబాటు ధరలపై ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీ నెరవేరకపోగా రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ నేపథ్యాన సమస్యలు పరిష్కరించి జగ్జిత్‌సింగ్ దీక్ష విరమింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో దల్లేవాల్‌కు మద్దతుగా సంఘీభావ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షలో నాయకులు మాదినేని రమేష్, దొడ్డపాటి రమేష్, మలీదు నాగేశ్వరరావు, తాతా రఘురాం, మురళి, ఎం.సుబ్బారావు, మేరుగు సత్యనారాయణ, తాటి వెంకటేశ్వరరావు, బండి రమేష్, ఎర్ర శ్రీనివాసరావు, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్.కే.మీరా, చింతనిప్పు చలపతిరావు, పొన్నగంటి సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ కింద పడి యువకుడి మృతి

పండుగకు సోదరిని తీసుకెళ్దామని వస్తుండగా ఘటన





లారీ కింద పడిన శ్రీనివాస్ (ఇన్‌సెట్) శ్రీనివాస్ మృతదేహం

ఖమ్మంక్రైం: సోదరిని పండుగకు తీసుకెళ్లడానికి వస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు లారీ కింద పడి మృతి చెందాడు. ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. టేకులపల్లి మండలం బేతంపూడి వెంకటాయతండాకు చెందిన బోడా వాత్యా కుమారుడు శ్రీనివాస్(20) డిప్లొమా చదువుతున్నాడు. ఆయన సోదరి శ్రావ్య ఖమ్మంలో చదువుకుంటుండగా సంక్రాంతి సెలవుల్లో తీసుకెళ్దామని ద్విచక్రవాహనంపై వచ్చాడు. ఈలోగా తన స్నేహితురాలు కలవడంతో ఆమెను బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు చేరుకోగానే ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ పక్కనుంచి వేగంగా పోనిచ్చాడు. ఈక్రమంలో లారీ శ్రీనివాస్ బైక్‌ను తాకడంతో అదుపు తప్పగా శ్రీనివాస్, ఆయన స్నేహితురాలు కిందపడ్డారు. ఆ సమయాన శ్రీనివాస్ లారీ చక్రాల కింద పడడంతో నలిగిపోయి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో ఆయన స్నేహితురాలికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. తనను పండుగకు తీసుకెళ్తామని వచ్చిన సోదరుడు మృతి చెందిన సమాచారం తెలుసుకుని వచ్చిన శ్రావ్య, తల్లిదండ్రులు వాత్యా – భాగ్యలక్ష్మి గుండెలవిసేలా రోదించారు. కాగా, ఘటనాస్థలాన్ని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించారు.

క్యాష్ గిఫ్ట్ ఆశచూపి..

- రూ.4లక్షలకు కుచ్చుటోపి

ఖమ్మంక్రైం: నగదు బహుమతి వచ్చిందని, తద్వారా రూ.67లక్షలు అందుతాయంటూ ఓ మహిళకు వీడియోకాల్ చేసి ఆశ చూపించిన వ్యక్తి రూ.4లక్షలు కాజేసిన ఘటన శనివారం ఖమ్మంలో చోటు చేసుకుంది. సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. ఖమ్మంలో నివాసముండే ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు పార్సిల్ వచ్చిందని మెసేజ్ పంపి ఫోన్ చేశారు. ఆతర్వాత వీడియో కాల్ చేసి లాటరీలో ఫోన్ నంబర్ ఎంపికై నందున రూ.67లక్షల బహుమతి వస్తుందని నమ్మబలికారు. అయితే, ముందు రూ.20వేల చెల్లించాలనడంతో ఆమె నిజమేనని నగదు ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆతర్వాత విడతల వారీగా రూ.4.20లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని కొన్నాళ్లుగా స్పందన రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. సంక్రాంతి సందర్భంగా బహుమతులు వచ్చాయని గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్లకు స్పందించి మోసపోవద్దని సీఐ సూచించారు.

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి గర్హనీయం

ఖమ్మంమయూరిసెంటర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి సరికాదని పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ప్రభుత్వ లోపాలపై ప్రశ్నించడంతో సమాధానం చెప్పలేక దాడులు చేయించడం గర్హనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమే అయినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాడుల సంస్కృతి మొదలైందని ఆయన మండిపడ్డారు.

కల్లంలో మిర్చి చోరీ



కల్లం వద్ద రైతు సీతారాములు

కొణిజర్ల: కల్లంలో ఆరబోసిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని అనంతారంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. బాధిత రైతు కానూరి సీతా రాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన రెండెకరా ల్లో సాగు చేసిన మిర్చిని గ్రామ సమీపాన కల్లంలో ఆరబోశాడు. శనివారం ఉదయం వచ్చేసరికి కొంత భాగం చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈమేరకు దుండగులు సుమారు ఐదు క్వింటాళ్ల మిర్చి ఎత్తుకెళ్లినట్లు సీతారాములు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేపట్టారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్ అరెస్ట్

కామేపల్లి: సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన కామేపల్లి మండలంలోని ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు... గోవింద్రాలకు చెందిన బోడా మంగ్యాజీనాయక్ ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన గతేడాది నుంచి ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాలకు చెందిన పలువురికి ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.లక్షల్లో వసూలు చేశాడు. ఆతర్వాత ముఖం చాటేయడంతో ఇటీవల సింగరేణి మండలానికి చెందిన భూక్యా హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగ్యాజీని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



మారేశ్వరి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన కుంటా మారేశ్వరి(40) ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తుంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె కోసం గాలిస్తుండగా శనివారం సత్తుపల్లిలోని తమ్మిలేరు వంతెన కింద వాగులో మృతదేహాన్ని గుర్తించారు. ఘటనపై ఆమె తండ్రి చిన్న వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ టవర్‌కు ఉరి వేసుకుని...

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం వద్ద ఓ వ్యక్తి విద్యుత్ టవర్‌కు ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబాద్ జిల్లా ధోద్రాకు చెందిన రోహిత్‌కుమార్(33) ఇటీవల పల్లెగూడెం ఇటుక బట్టీలో పనిచేస్తున్న బంధువుల వద్దకు వచ్చాడు. అక్కడే పనికి కుదిరినా.. కొంతకాలంగా మానసికస్థితి సరిగ్గా లేని ఆయన బంధువులను దూషిస్తూ గొడవ పడి ఈనెల 10న బయటకు వెళ్లిపోయాడు. శనివారం ఉదయం విద్యుత్ టవర్‌కు ఉరి వేసుకోవడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో మృతుడిని రోహిత్‌గా గుర్తించారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

అర్హులందరికీ పథకాలు చేరేలా కార్యాచరణ

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి శనివారం ఆయన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరుపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగు పథకాల అమలును గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభిస్తోందని తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏఓ ఈ పథకాల అమలుకు బాధ్యత వహించాలని, పంచాయతీ కార్యదర్శి, ఆర్‌ఐ, ఏఈఓలతో సమన్వయంతో అర్హుల గుర్తింపుపై దృష్టి సారించాలని చెప్పారు.

వ్యవసాయ యోగ్యం కాకపోతే తొలగింపు

రైతుభరోసా అమలులో భాగంగా వ్యవసాయ యోగ్యం కాని భూములను జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ సూచించారు. ఇల్లు లేదా కాలనీలుగా మారినవి, వెంచర్లు, రోడ్లు వేసినవి, పరిశ్రమలు, గోదాంలు, మైనింగ్‌కు వినియోగిస్తున్న స్థలాలే కాక ప్రభుత్వం సేకరించిన భూములు, రాళ్లు, రప్పలు, గుట్టలతో నిండినవి గుర్తించాలన్నారు. ఇదేసమయాన వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు పంట వేసినా, వేయకున్నా రైతు భరోసా అందుతుందనే అంశంపై అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా, రైతు భరోసా పథకానికి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు రూ.12 వేల చొప్పున సాయం అందుతుందన్నారు. అలాగే, భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏటా రూ.12వేలు అందించనుండగా, రేషన్‌కార్డులకు అర్హుల జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. ఇక ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల జాబితా గ్రామాల వారీగా సిద్ధం చేశాక జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి అందించాల్సి ఉంటుందని చెప్పారు. ఈసమావేశంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీఓ జి.నర్సింహారావు, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డీఏఓ పుల్లయ్య, డీఎస్ఓ చందన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టైటిల్ కరీంనగర్ కైవసం

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీలు



ఫుట్‌బాల్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన ఖమ్మం జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఫుట్‌బాల్, లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించగా ఫుట్‌బాల్‌లో కరీంనగర్ జట్టు టైటిల్ దక్కించుకుంది. రెండు, మూడు స్థానాల్లో ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్లు నిలిచాయి. అలాగే, లాన్ టెన్నిస్ టీం ఈవెంట్‌లో కరీంనగర్ ఉద్యోగులు ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఈ జిల్లాకు చెందిన టీ.వీ.రావు, శ్రీనివాసులు, సంతోష్, ఎం.డీ.రఫీక్, సాయికృష్ణ టైటిల్ గెలుచుకోగా రెండోస్థానంలో విద్యుత్ సౌధ(హైదరాబాద్)కు చెందిన క్రీడాకారులు శ్రీహరి, శ్రీనివాస్, దినేష్, తేహస్, హోసోమ్, తృతీయస్థానంలో కార్పొరేట్(హైదరాబాద్) క్రీడాకారులు రాము, కరుణాకర్‌రెడ్డి, గోవర్ధన్, అశోక్, అనిల్‌కుమార్ నిలిచారు. వ్యక్తిగత విభాగంలో వెంకటేశ్వర్లు(మహబూబ్‌నగర్), సుమన్(సైబర్ సిటీ), రాము(కార్పొరేట్–హైదరాబాద్), డబుల్స్‌లో టీ.వీ.రావు – శ్రీనివాసులు(మహబూబ్‌నగర్), డి.రాము, కరుణాకర్‌రెడ్డి (కార్పొరేట్–హైదరాబాద్), శ్రీహరి, శ్రీనివాస్(విద్యుత్‌సౌధ– హైదరాబాద్)లు వరుసగా మూడు స్థానాలు దక్కించుకున్నారు. అనంతరం విజేతలకు ఖమ్మం డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాస్, బి.బాబునాయక్, ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ బహుమతులు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో డీఈలు ఎస్.జగన్నాథరావు, ఎస్.నాగరత్నం, బాబురావు, రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.2వేలు చెల్లిస్తే రూ.8వేల సామగ్రి అంటూ వసూళ్లు

రఘునాథపాలెం: పండుగల వేళ ప్రజలను మోసం చేసి రూ.వేలల్లో వసూలు చేసి ముఖం చాటేయడం చాలాచోట్ల పరిపాటిగా మారింది. రఘునాథపాలెం మండలంలోని చిమ్మపుడిలో ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. ఒకేసారి రూ.2,500 చెల్లిస్తే ఎనిమిది నెలల పాటు రూ.వెయ్యి చొప్పున సామగ్రి ఇస్తామని కొందరు వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. ఈ వసూళ్లకు మధ్యవర్తిగా అదే గ్రామ మహిళ వ్యవహరించినా ఏపీకి చెందిన వ్యక్తి సూత్రధారిగా తెలిసింది. అలాగే, తీసుకున్న నగదుకు రశీదు ఇవ్వకపోవడంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. మధ్యవర్తిగా ఉన్న మహిళ గ్రామంలో ప్రభుత్వ పథకంలో పనిచేస్తుండగా ఇటీవల హైదరాబాద్ శిక్షణకు వెళ్లొచ్చాక ఈ స్కీంపై ప్రచారం చేసింది. దీంతో గ్రామానికి చెందిన సుమారు 100 మందికిపైగానే డబ్బు చెల్లించినట్లు సమాచారం. ఈక్రమాన బాధ్యుడైన వ్యక్తి సరుకులు ఇవ్వకుండా ముఖం చాటేయడం, మహిళ కూడా స్పందించకపోవడంతో స్థానికులు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ విషయమై ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.